ప్రేమపాశం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(అనువృత్తము)

మూడో అంకం

మొదటి రంగం

[వేంకటశాస్త్రియిల్లు, వీధితలుపు వేసివుంటుంది. తలుపుతట్టుతూ రాయడు—]

రాయడు—చిన్నమామయ్యా! (తలుపు మళ్లీ తట్టి, స్వగతం) యింట్లో లేనట్లున్నాడు మామయ్య. అత్త వంటింట్లో వుంటుంది. బంగారమ్మ యేం చేస్తోందో? పదిసార్లు కేకలేసినా పలక్కపోతే యెలాగా? అబ్బ! మండపేటనుంచి ద్వారపూడిదాకా నడిచి వచ్చేటప్పటికి తాతలు దిగివచ్చారు. కాళ్లు పీక్కపోతున్నాయి. కాస్తసేపు కూచుంటేగాని వుండలేను. వొక్కక్షణంవుండి మళ్లీ పిలవ్వచ్చు. (మెట్ల మీదికి కాళ్లువేసుకూర్చుని) రైలుఖర్చులకి సరిగ్గా తూచియిచ్చింది మా అమ్మ డబ్బులు. రానూపోనూ అర్ధరూపాయవుంటే దర్జాగా జట్కాయెక్కుదును. మొన్న ఆలమూరులో దొరికిన సంభావనడబ్బులు అర్ధరూపాయీ జట్కాకోసం తగలేస్తే క్రాపింగుదువ్వెన్న మాటేమిటి? వెధవ కొమ్ముదువ్వెన్నతో పాపిడి బాగారాక చస్తున్నాను. (ఒక్కక్షణం వూరుకొని) పదిమాట్లు వస్తూ పోతూవుంటే శక్తిసామర్థ్యాలు గ్రహించి మామయ్య బంగారాన్ని నాకిస్తాడని అమ్మ వూహ. ఇది మంచిదారే. లేకపోతే మామయ్యకి నా సంగతి యేం తెలుస్తుందీ? కాని నాన్న వద్దంటాడు. "మాపిల్లని మీ అబ్బాయి కిస్తా" నంటూ తన కాళ్ల దగ్గిరికి రావాలంటాడు. అలా అయితే మామయ్య మరోసమ్మంధం చూసుకుంటే? కోటమ్మ దొడ్డమ్మ అప్పుడే బేరాలు మొదలుపెట్టిందిట. వాడి మొఘం వెంకడికిస్తారుటగానీ—అయినా మన ప్రయత్నం మానగూడదు. యెలాగేనా బంగారమ్మని పెళ్లాడితినా నేను అదృష్టవంతుణ్ణన్నమాట. ఈమేడా, ఆస్తీ అంతా దానిదే; కనక బంగారమ్మని పైగా దాటిపోనియ్యగూడదు......మహా చెడ్డదాహంగావుంది. మళ్లీ పిలిచి చూద్దాం (లేచి 'మామయ్యా' అనితలుపు తట్టుతాడు.)

(తెరలో)

ఎవరు వారూ?

రాయడు—(స్వగతం) బంగారమ్మే. తలుపు తీశాఇప్పటికి పెళ్లికూతురుదర్శనం. మంచిశకునమే. (ప్రకాశం) నేనురాయణ్ణి.

(అప్పుడు తలుపుతీసి బంగారమ్మ యివతలికి వస్తుంది.)

బంగారమ్మ—నువ్వా?

రాయడు—యెన్నిమాట్లు పిలిచినా పలికారు కారేం యెవరూనూ?

బంగారమ్మ—యింటో యేదోపని చేసుకుంటున్నాం. కాకపోయినా మేమిప్పుడాట్టే తలుపు తియ్యడం లేదు. కలరాతో వూరంతా పేలిపోతోంది.

రాయడు—ఎక్కువెప్పణ్ణుంచీ?

బంగారమ్మ—నిన్న పొద్దుటినుంచీనీ. యిలాంటప్పుడు వచ్చావేం?

రాయడు—తెలిసిందికాదు. మాఅమ్మ తొందరపెడితే వచ్చాను.

బంగారమ్మ—యేంపనీ?

రాయడు—అదివేరేపనీ. మామయ్య వున్నాడా?

బంగారమ్మ—యెందుకో వూళ్లోకి వెళ్లాడు. భోజనాలవేళకి వస్తాడులే. నూతికి వెళ్లి కాళ్లు కడుక్కో.

రాయడు—(స్వగతం) కలరా అంత తీవ్రంగా వుంటే పెళ్లికూతురు చూపులు దేవుడెరుగును. భోజనంకాగానే పరుగో పరుగు.

(లోపలికి వెళ్లిపోతాడు.)

బంగారమ్మ—(స్వగతం) యింకా వచ్చాడు కాదూ నాన్న. యెన్నివిధాల చెప్పినా మానకుండా వున్నాడు వూళ్లోకి వెళ్లడం. యెప్పుడు తగ్గుతుందో యీకలరా? బావయెప్పుడు వస్తాడో? కలారా తగ్గేదాకా నేనా మాయింటో వుండమనాలి. యీమాటు పట్టుపట్టి యింట్లో కూచో పెడతాను. నామాట వినకపోతే యెరగనూ? బావవుంటే అతనిచేత చెప్పించి నాన్ని కూడా కదలకుండా చెయ్యవచ్చు.

(తలుపువేసేసి, లోపలికి వెళ్లిపోతుంది.)

రెండోరంగం

[మాచవరం గ్రామంలో పేరుభట్టుయిల్లు. లోపల సూరన్నా, తల్లి జోగమ్మా, చెల్లెలు సుబ్బమ్మా కూచుని వుంటారు.]

సూరన్న—అసలు నువ్వు గారంచేర్చావు పేరిగాడికి.

జోగమ్మ—నే నేంచేశానురా? నిన్నెలా పెంచానో వాణ్ణీ అలాగే పెంచాను.

సూరన్న—నువ్వు లక్షచెప్పు. నాన్న కూడా వాడు లోంగ లేదు.

జోగమ్మ—దానికి నేనేం చెయ్యనూ? చిన్నప్పణ్ణుంచీ వాడికి స్వతంత్రమే. అది వొంటెత్తుగుణం కాదుగానీ—

సూరన్న—అదిగో. అదే నీ తెలివితక్కువ. అబ్బా! వాడంత వొంటెత్తుగుణంవున్నవా డింకొకడున్నాడా పృథివిమీదా? పెద్దాడు నయంకొంచెం.

జోగమ్మ—వాడిమొహం. పెళ్లాంవచ్చాక వాడి బుద్ధి బొత్తిగా మారిపోయిందిరా.

సూరన్న—పేరిగాడికి పెళ్లాం కాపరానికిరానే అక్కర్లేదూ. పెళ్లయాక—మూడుముళ్లూ పడ్డాక వొక్క క్షణమేనా కలిసివుండడువాడు.

జోగమ్మ—వేరుపణ్ణిస్తానేం వాణ్ణీ?

సూరన్న—యేంచేస్తావూ?

జోగమ్మ—ఆమాటకివస్తే యింతట్లో వాడికి పెళ్లేచెయ్యనూ. దాంతో చప్పగా కుదురుతుంది రోగం.

సూరన్న—నువ్వు చెయ్యకపోతే ఆగుతుందా యేమిటి? అసలు వాడు రాజమహేంద్రవరంలో ప్రవేశించడమే ముప్పు. దానివల్ల వచ్చే చిక్కుమిట్లో గ్రహించావా? మనల్ని లోకువచెయ్యడానికి చిన్నమామ వాణ్ణి లోపు చేసుకుంటాడు. ఈ వాజమ్మ అతనివెనకాల గంతులేస్తాడు.

జోగమ్మ—వేంకటేశంతో మాట్లాడడంటే వాణ్ణి గుమ్మంలోకిరానివ్వను.

సూరన్న—అదికాదు ప్రయోజకత్వం. యింట్లోనుంచి వొక్కరాగివమ్మిడీ అయినా వాడికి దొరకనివ్వకూడదు.

సుబ్బమ్మ—చిన్నమామయ్యగారి యింటికి వెడితే యేమో పేరుభట్టన్నయ్యా?

జోగమ్మ—వెడితేయెరుగనూ?

సుబ్బమ్మ—ఏమే? ఏంతప్పేఅమ్మా?

జోగమ్మ—చిన్నమామ ఛండాలుడు. వాడి మొహం చూడగూడదు.

సుబ్బమ్మ—ఏంచేశాడే?

జోగమ్మ—నీకిప్పుడు తెలవదడి.

సుబ్బమ్మ—అత్త యెంచక్క మాట్లాడుతుంది. బంగారమ్మవొదిన యెంచక్కనిపాటలు పాడుతుంది. పోనీ దాన్ని పేరుభట్టన్నయ్యకి పెళ్లిచెయ్యరాదుటే అమ్మా?

జోగమ్మ—ఛీ! దాన్నా!

సుబ్బమ్మ—యించక్కా వుంటుందే వొదినా.

జోగమ్మ—దాని చక్కదనం మాసిపోయెను! అదెందుకు మనకీ?

సూరన్న—పేరిగాడు బహుశా దానిమీద కన్నువేసే రాజమహేంద్రవరం ప్రవేశించివుంటాడు. ఇన్నీసుపేటలో ప్రవేశించడంచేత నాసందేహం మరీ వృద్ధవుతోంది. వాడూ, మామా రోజూ యెక్కడో వొకచోట తారసపడకమానరు. అలా పదిమాట్లు జరిగేటప్పటికి—ముందు మనపెద్దమ్మే కలుపుతాడు.

జోగమ్మ—అవున్రోయి, నువ్వన్నది నిజమే. లేకపోతే సంగీతం విజయనగరంలో చెప్పుకున్నవాడు కావ్యాలకోసం రాజమహేంద్రవరం యెందుకు చేరతాడూ? విజయనగరంలో లేరాయేమిటి చెప్పేవాళ్లు?

సూరన్న—కనిపెట్టావూ అబ్బాయియుక్తి? యేమనుకున్నావు మరి?

జోగమ్మ-యింటికి నుంచున్న పాళంగా రమ్మని వుత్తరం రాసెయ్యి, వాణ్ణక్కడవుండనివ్వగూడదు.

సుబ్బమ్మ—ఏమేఅమ్మా? బుల్లన్నయ్యకి బంగారమ్మ వొదిన్ని పెళ్లిచెయ్యండే, దాందగ్గిర నేను పాటలు నేర్చుకుంటానే.

సూరన్న—బాగానే నేర్పుతుంది నీకది పాటలు.

సుబ్బమ్మ—ఏమమ్మా? చిన్నప్పుడు నేనూ అదీ జతగావుండేవాళ్లం యేమనుకున్నావో. నీపెళ్లిలో అదీ నేనూ ప్రత్యేకంగా కూచునీవాళ్లం భోజనాల దగ్గిర. అదీ నేనేగాదా యేమిటి నీకు హారతి యిస్త?

జోగమ్మ—నువ్విప్పుడు జ్ఞాపకమా ఆసింగమ్మకి?

సుబ్బమ్మ — యెందుకు జ్ఞాపకంవుండనూ? బుల్లన్నయ్యకి పెళ్లిచేస్తే—

సూరన్న—వూరుకో సుబ్బా నీకేమీ తెలవనూ.

సుబ్బమ్మ—ఏమేఅమ్మా! దాన్ని బుల్లన్నయ్యకి పెళ్లిచెయ్యవే.

జోగమ్మ—వుండవే వూరికేను. జలగలాగ పట్టుకు పీక్కుతింటావేమిటి? వూరుకో లేకపోతే అవతలికిపో.

సుబ్బమ్మ—(మూతిముడుచుకొని) పోతానులే. (వెనక్కి తిరిగితిరిగిచూస్తూ వెళ్లిపోతుంది.)

సూరన్న—నువ్వు కనిపెట్టలేకపోయావు గాని వాడిగుణం మొదణ్ణుంచీ అంతే. నీదో వెఱ్ఱి. నీమీద యెవడికి భక్తివుందో, యెవడికి లేదో కనిపెట్టలేవు నువ్వు.

జోగమ్మ—నేనంతచేతగాని పీనుగనను కున్నావా యేమిట్రా? పెద్దాణ్ణి నే నెప్పుడూ నమ్మలేదూ. పేరిగాడి గుణంకూడా యేడాదినుంచి తెలుస్తూనేవుంది. యెందుకూ? మొన్న అన్నివిధాల కబురంపినా వొక్కజామారుకుడ్డ తల్లిముండకికొని పంపలేకపోయాడు. మరిచిపోతానా యీజన్మలో?

సూరన్న—యెన్నిప్రశ్నలు వేశాడనుకున్నావావేళ?

జోగమ్మ—వేస్తాడు వేస్తాడు. సాగుతోంది ఆంద్రబ్బ.

సూరన్న—యిప్పుడేంచూశావూ? పెళ్లి అడ్డం కాస్తా తీరనియ్యి.

జోగమ్మ—ఆమాటకివస్తే అసలు వాడికి పెళ్లే తలపెట్టనూ యింతట్లోను.

సూరన్న—మొత్తానికి వాడివిషయంలో జాగ్రత్తగా వుండకపోతే సంసారం నట్టేట్లో కలుపుతాడు. మరి నాకు పొద్దెక్కుతోంది. సోమేశ్వరంలో యివాళ నవగ్రహశాంతివుంది. వెడితే అర్ధరూపాయేనా దొరుకుతుంది.

జోగమ్మ—నిన్న బ్రాహ్మణార్థం మూలాన్న రాత్రి భోజనం లేదుకదా శాంతిభోజనాలయ్యేదాకా వుండగలవా నాయనా? పైగా అయిదుమైళ్లు నడవాలి గూడానూ.

సూరన్న—లేకపోతే రోజు లెలావెడతాయమ్మా? వెడితే యివాళతో చెల్లాయికి పరికిణీ

కొనెయ్యవచ్చు. కొత్తపరికిణీ కావాలో అంటోందది పాపం యిరవై రోజులనుంచి. (వెళ్లిపోతాడు.)

జోగమ్మ—(స్వగతం) పేరిగాణ్ణి నమ్మకూడదు. సూరిగాడే నయం అందరికోకీనీ. అమ్మాయికి పరికిణీలూ, చొక్కాలూ కావాలని చెప్పడం తడువూ. కూతుళ్ల నేనా అంతశ్రద్ధగా చూడదు. నారోజులు వీడి దగ్గిరే వెడతాయి.

మూడో రంగం

[వేంకటశాస్త్రియిల్లు. విచారంతో కాంతమ్మ కూచునివుంటుంది. బంగారమ్మకూడా విచారపడుతూ పేరుభట్టు తొడమీద కూచుని వుంటుంది. రత్తమ్మ ఒకపక్కనీ, రాయడు వొకపక్కనీ కూచునివుంటారు.]

పేరుభట్టు—డబ్బుకాశపడి వెళ్లాను కాకినాడ. వెళ్లాటప్పటికి మామయ్య కులాసాగానే వున్నాడు. అనుమానమే లేదూ. వచ్చాటప్పటికంతా—అన్నీ జరిగిపోయాయి. ఘోరకలి.

రత్తమ్మ—నల్లరాయి బద్దలై పోయిందిరా.

కాంతమ్మ—యీవూరు వచ్చి ఆరేళ్లయింది. ఎప్పుడూ జబ్బెరగరు. జలుబేనా చెయ్యలేదు మీ తమ్ముడికి. నేటికి వొక్కమాటేవచ్చింది ముప్పెన.

బంగారమ్మ—బావోయి నువ్వు మమ్మల్ని విడిచిపెట్టకు సుమా. నాయన వెళ్లేపోయాడు. యిక మాకు దిక్కెవ్వరు బావా? (కంఠానికి చేతులు పెనవేసి దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—వద్దువద్దు. యేడవకు బంగారం! నేనెక్కడికి పోతానూ?

కాంతమ్మ—నాయనా! చెట్టుకింది పక్షులం అయిపోయాం. (దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—అత్తా! వూరుకోమనడానికి గుండెలు తాళడంలేదు. అయినా యేంలాభమూ?

రత్తమ్మ—దిగ మింగుకోవమ్మా దిగ మింగుకో. (పైకిచూసి) దేవుడా! నీకళ్లకి నాతమ్ముడే కనపడ్డాడా?

రాయడు—దేవుడు మంచివాళ్లని యేరుకుపోతాడు.

కాంతమ్మ—యేలోటూ లేదని పొంగిపోయే రోజుల్లో తీరని యీపెద్దలోటు పెట్టాడు దేవుడు. కష్టం మరిచిపోయినవాళ్లని నట్టేట్లో ముంచేశాడు.

పేరుభట్టు—అంతే పెట్టిపుట్టాం. మనుష్యమాత్రులికీశ్వరలీల యేంతెలుస్తుందీ?

రత్తమ్మ—నువ్విక్కడే వుంటున్నావుట్రా పేరుభట్టూ?

పేరుభట్టు—అవును పిన్నీ. నువ్వెప్పుడువచ్చావూ?

రత్తమ్మ—నిన్నరాత్రికి వచ్చామురా నాయనా! మేంవచ్చాటప్పటి కన్నీ అయిపోయాయి. అన్నింటికీ యెదటింటో వున్న ప్రకాశంగారు దిక్కయారుట.

కాంతమ్మ—నాయనా! కొంపపడిపోవడమూ, దిక్కులేకపోవడమూనూ. అయ్యో! భరించలేనోయి! (దుఃఖిస్తుంది.)

బంగారమ్మ—బావా! సముద్రంలోపడి కొట్టుకుపోయామనుకో. యెలాబతికివున్నామో తెలవదు. నిన్ను చూసీదాకా ప్రాణాలు ప్రాణాల్లోలేవు. యిక నువ్వెక్కడికీ వెళ్లకుబావా! మాయింటో వుండవూ? వుండవూ? నాకేడుపువస్తోంది. (ఏడుస్తూ) వుంటాననవూ?

పేరుభట్టు—(బంగారమ్మనిగుచ్చి కౌగలించుకొని) నాకడుపు చెరువై పోతోంది. యిక యేడవకు బంగారం! నేనిక యెక్కడికీ వెళ్లను. యిక్కడే వుంటాను వూరుకో.

కాంతమ్మ—నీకు సాగుతుందా నాయనా?

పేరుభట్టు—చూస్తావుకాదూ?

రత్తమ్మ—(స్వగతం) వీణ్ణిక్కడ వుండమంటూ రెండుకూ తల్లీ కూతురూనూ? వీళ్లమనస్సు తిప్పెయ్యాలి. లేకపోతే బంగారం తక్కదు.

రాయుడు—(స్వగతం) యుక్తిచేసి యిది జరగ నివ్వకూడదు.

(అప్పుడు ప్రకాశంవస్తాడు.)

ప్రకాశం—యిదిగో పేరుభట్టుగారా ? అంతా యిలా జరిగింది.

పేరుభట్టు—డబ్బుకాశపడి మామయ్యని విడిచి పెట్టి వెళ్లాను. కానలేకపోయాను.

ప్రకాశం—రెండువందల నలభై రూపాయలు.—కాకపోయినా యిలాజరుగుతుందని అనుకోడం యెలాగా ? కలరా తగులుతుందన్న సూచన యిక్కించిత్తేనా వుంటేనా ?

కాంతమ్మ—సాయంత్రం మణిగింది, మన్నాడు తొమ్మిదయాటప్పటికి కొట్టేసింది. రెండురోజులేనా నిలుపుచెయ్యందే నాయనా ! (ఏడుస్తూ రత్తమ్మకేసి తిరిగి) నన్ను కొట్టెయ్యరాదూ వొదినా ? నాకీమొండి బతుకెందుకూ ?

బంగారమ్మ—(కళ్లుమూసుకుని దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—నామాటవినవూ ? నేనుభరించలేను బంగారం. (డగ్గుత్తికతో) వూరుకోవూ ?

రత్తమ్మ—ప్రకాశంగారూ ! యీలోటంతా—యీదురదృష్టం అంతా మాది. వొక్కతమ్ముడున్నాడు నాతమ్ముడు మానాయనకంటే యెక్కువగా మమ్మల్ని చూశాడు. యికమాకు పచ్చంచులబట్టపెట్టే తోడబుట్టిన వాడేడీ ? (ఏడుస్తుంది.)

ప్రకాశం—అక్కయ్యగారూ ! యిది సముద్రం. ఆగదు; కాని ఆపుకోవాలి. యేంచెయ్యం ? యెవళ్లవల్ల యేమవుతుంది ? ఆ మహానుభావుడు బతకడానికి వయస్సులేదా, బతకలేనన్నాడా ? యిలాజరగాలి. మనం అంతా యిలా యిదవాలి.

రత్తమ్మ—అంతేనండీ. మనవల్ల — యెంత యేడ్చినా యేమీరాదు. మనస్సు రాయిచేసుకోవాలి. (కాంతమ్మకేసి చూసి) యేంచెప్పను మరదలా ? దిగమింగుకోవాలి.

రాయుడు—మామామయ్యదగ్గిర రాజమహేంద్రవరంలో వుందామనుకున్నాను నేను.

ప్రకాశం—అందరికోరికలూ పూర్వపక్షంఅయిపోయాయి. అంతా మనతోటే వుందని వూరికే కల్పనలమీద కల్పనలు చేసుకుంటాం ; కాని యీశ్వరుడు కొనసాగించవద్దూ? తక్కువచేసుకొని యెక్కువకోసం ఆశపడితే యేంలాభమూ ? నామట్టుకునాకు కుడిచెయ్యి పడిపోయింది. యేంచెయ్యనూ.

పేరుభట్టు—నామాటచెప్పండి బాబుగారూ ? మామయ్య ఆధారంచూసుకుని యీవూళ్లో వుందామని నిశ్చయించుకున్నాను. నాకల్పన యెలాకూలిపోయిందో చూశారా ?

ప్రకాశం—యిందరి దురదృష్టం పోగయినాక శాస్తుృలుగారెలా బ్రతికివుంటారూ?......అక్కయ్యగారూ ? మీరోమాటు దొడ్లోకి రావాలి.

(కాంతమ్మ ప్రకాశంవెనకాల వెళుతుంది.)

బంగారమ్మ—నేనుకూడా రావచ్చునా మామయ్యగారూ ?

ప్రకాశం—నీకడ్డేమిటమ్మా ?

కాంతమ్మ—రాతల్లీ !

(బంగారమ్మకూడా వెళుతుంది.)

రత్తమ్మ—చూడూ, పేరుభట్టూ ! యెంత మేనమాను కూతురయినా, యెంత చనువయినా, దుఃఖంలోనేవున్నా పన్నెండేళ్లపిల్ల. నువ్వు వొళ్లో కూచోబెట్టుకోగూడదురా నాయనా !

రాయుడు—అలాయెందుకన్నయ్యా? దూరంగా వుండే—అంటే ముట్టుకోకుండా సుమా, మనం ధైర్యం చెప్పవచ్చు. మనం జాగ్రత్తగా వుండడమే మంచిదీ. యేమంటావు ?

పేరుభట్టు—నిజమే పిన్నీ ! నువ్వు పెద్దదానవు. నీమాట తోసెయ్యడానికి వల్లకాదు. రాయుడుకూడా చిన్నవాడయినా చాలాదూరం ఆలోచించాడు. మంచి సలహా చెప్పాడు వాడు. అలాగే చేద్దాం.

రత్తమ్మ—అదిగదీ. నాయనా! కష్టంలో వున్నారు. చేతనైనంత సాయంచేద్దాం.

రాయడు—అన్నయ్యకి వొకళ్లు చెప్పనే అక్కర్లేదే అమ్మా. ఆదుర్దాకొద్దీ—తీరా దానికదివచ్చి వొళ్లో కూచోడంవల్ల కూచోబెట్టుకున్నాడు; గాని తెలవదనుకున్నావా? నావంటివాళ్లకి పద్నాలుగురికి చెప్ప గలడు వాడు.

పేరుభట్టు—(స్వగతం) యేం శ్రీరంగనీతులూ? కారణం మరేమీలేదూ. బంగారంమీద కన్నువేశారు వీళ్లు. అబ్బరమా? అలాంటిపిల్ల యెంత తపస్సుచేస్తే దొరుకుతుందీ? రాయడు అదృష్టవంతుడు. రాకపోకలున్నాయికనక కోరిక నెరవేరవచ్చు. నేను కేవలమూ దురదృష్టవంతుణ్ణి. మాచిన్నన్నయ్యచేసిన కుట్ర నన్ను పాడుచేసేలావుంది.

ప్రకాశం—(ప్రవేశించి) మీరోమాటు యిలా రావాలి.

(ఇద్దరూ వెళ్లిపోతారు.)

రత్తమ్మ—వోరేయి! రాయడూ! పేరుభట్టు బంగారానికి చనువయినట్టుగా వున్నాడు. దాని మనస్సు నీమీదికి తిప్పేసుకోవాలి. యేంచేస్తావోమరి నేను కాంతమ్మ మెడలు వొంచుతానులే.

రాయడు—ఈ పదిరోజుల్లోనూ యెంత పని చేస్తానో చూసుకో.

రత్తమ్మ—నే నోమాటు బసలోకి వెళ్లివస్తాను. అత్త యేదేనా చెప్పిందంటే వెంటనే చేసేస్తూవుండు నువ్వు.

రాయడు—ఆవిడ చెప్పకుండా—వూహించే చేసేస్తాను నేను.

నాలుగో రంగం

[పొద్దున్న యెనిమిదింటికి; కాంతమ్మ తూర్పు వసారాలో గోడకానుకొని కూచునివుంటుంది. ప్రకాశం రెండుగజాలలో నుంచుని వుంటాడు.]

ప్రకాశం—పేరుభట్టుగారిలాంటి మనిషి వున్నాడా? కానీ, అక్కయ్యగారూ! ఆయన చిన్నన్న వున్నాడే సూరన్నగారు? రామరామా! ఈశ్వరుడాయన్ని యెందుకోసం సృష్టించాడో గాని కిందపెడితే పంటలూ, పైన పెడితే వానలూ వుండవు.

కాంతమ్మ—అతగాడిదేనండీ యీకుట్ర అంతానూ. దేవుడు సాధించినప్పుడు మనుష్యులు సాధించడం ఆశ్చర్యమా అన్నయ్యగారూ?

ప్రకాశం—పొద్దుటిపూట యేగడియో వుంటారిక్కడ. తరవాత స్నానంచేసింది మొదలు యిక అక్కడవొకటే గుసగుసలు. ఇవాళనాకు చెవులు తడకలు కట్టిపోయాయి. రత్తమ్మగారుకూడా కలిసింది; కాని ఆవిడిమాటలు నాకు సరిగా వినపడలేదు.

కాంతమ్మ—ఆభాసు చేసేలావున్నారేంగతి అన్నయ్యగారూ?

ప్రకాశం—విచారించకండమ్మా. పేరుభట్టు గారు ఆలాంటి శాస్త్రాలకు జడిసేవారు కారు.

కాంతమ్మ—అత నలాంటివాడేనండీ. కనకనే వొప్పుకున్నాను. మాడండీ. యిద్దరు తమ్ములున్నారు. వచ్చారుకూడానూ; కాని వొక్కడుకూడా సిద్ధపడలేకపోయాడు. పేరుభట్టు పూనుకోకపోతే—

ప్రకాశం—పూనుకోకపోవడం యేదీ? వొకవేళ ఆయన యేకారణంచేతనైనా జంకి మానేస్తే నే నేమయినానూ?

కాంతమ్మ—దేవుడు మిమ్మల్నే మాకు దిక్కు చేశాడు. (అంటూ అతని పాదాలు అంటబోతుంది.)

ప్రకాశం—(వెనక్కి జరిగి) మీకేవెఱ్ఱి యేమిటక్కయ్యగారూ?

(అప్పుడు పేరుభట్టు మెల్లిగావస్తాడు.)

ప్రకాశం—రండి మహానుభావా!

కాంతమ్మ—మా మూలాన్ని నువ్వు మీవాళ్లకి దూరం అయిపోయీలావున్నావోయి నాయనా!

పేరుభట్టు—అదేమిటత్తా? మాఅత్త అలా అంటుందేమండీ బాబుగారూ?

కాంతమ్మ—మేము సముద్రంలోపడి మునిగిపోయేటప్పుడు నువ్వు రక్షించడం మీవాళ్ల కిష్టంలేదు.

ప్రకాశం—మీచిన్నన్నయ్య కిందామీదా వుండడం లేదు.

పేరుభట్టు—వాడి బతుకెప్పుడూ అంతే. కట్టిపెట్టండి వాడి ప్రస్తావన, అందులో సారస్యంలేదు.

ప్రకాశం—నిజమేగాని మీవాళ్లకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే మీకేమేనా నష్టం వస్తుందేమో అని మీఅత్తగారి భయం.

పేరుభట్టు—నష్టం యెలాగా కనిపెట్టుకునే వుంది. మాఅమ్మకి మాచిన్నాడిమాట యెప్పుడు పథ్యం అయిందో అప్పుడే మొదలయింది సంసారానికి దిగతీత. విచారించవలసిన సంగతి యేమీలేదు. నాకు బెంగ కూడా లేదు. మీకుగూడా యేమీ—

కాంతమ్మ—నామహారాజు పోయి నే నేడుస్తూ వుంటే వాళ్ల కీసుసగుసలూ, యీకుట్రలూ యెందుకు చెప్పండన్నయ్యగారూ! కష్టంలోవుంధిగదా అని అంతా తలోరాయీ వేస్తారా?

ప్రకాశం—సత్రాల్లో రాళ్లువేశేరకం యిదీ. అయితే యేది యెలా జరగాలో అలా జరుగుతుంది. మనం మాట్లాడవలసిందేమీ లేదు. ఏమీ యెరగనట్లూ, విననట్లూ వూరుకుందాం. ఏమంటారు పేరుభట్టుగారూ?

పేరుభట్టు—అదీ నావుద్దేశం.

(అప్పుడు బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ—అమ్మోయి! (ప్రకాశాన్ని చూసి) నరసయ్యశెట్టిగారి చెల్లెలు విశాలాక్షమ్మగారు రెండు కావిళ్లతో యేమిటేమిటో పట్టించుకు వచ్చారండీ మామయ్యగారూ!

కాంతమ్మ—చూశారా అన్నయ్యగారూ? ఆ యింట్లో అందరికీ నామహారాజంటే దేవుడు. నాదేవుకిడి యోగం లేకపోయింది; గాని మేడమీది సామానంతా విశాలాక్షమ్మగారిచ్చిందే. కాశీ తీసుకువెళ్లినప్పణ్ణుంచీ ఆయన భోంచేశారని తెలిస్తేగాని ఆవిడ పచ్చిమంచినీళ్లేనా ముట్టుకోదు. నేనూ, పిల్లా కట్టుకొనే బట్టలన్నీ ఆవిడయిచ్చినవే. వొక్కకడుపున పుట్టిన చెల్లెల్నికంటే యెక్కువగా చూస్తోందినన్ను. నిన్న యాభైరూపాయలు యిచ్చేవుందిగదా. మళ్లీ యివాళ అంతసామాను తేవడం—కులం కాకపోతే మాత్రం యేమిటండీ స్నేహమూ, దయా ప్రధానం గానీ?

ప్రకాశం—బ్రాహ్మలనేకమంది శాస్త్రిలుగారి సాయం పొందారు; గాని వాళ్లకి విశ్వాసం లేకపోయింది. ధర్మం చెప్పవలసివచ్చినా, విశ్వాసం చెప్పవలసివచ్చినా కోమట్లది.

బంగారమ్మ—మామయ్యగారూ! అవి యింటో పెట్టిస్తారా?

ప్రకాశం—నువ్వు పెట్టించరాదుటమ్మా? పోనీ, పేరుభట్టుగారూ! మీరూ—

పేరుభట్టు—తమరు—

ప్రకాశం—వచ్చినవారిని మీరెరగరు. నేనావిడితో మాట్లాడుతూవుంటాను. మీరే పెట్టించండి. పదండి.

(ఇద్దరూ వెళ్లిపోతారు. రత్తమ్మ వస్తుంది.)

రత్తమ్మ—యెవరోకోమటావిడిలావుండే యేమిటేమిటో రెండుకావిళ్లతో పట్టించుకువచ్చిందీ.

కాంతమ్మ—వొదినా! యీవూళ్లో కోమట్లకి మామీద యింత అనుగ్రహంవుంది. దేవుడు చూడలేకపోయాడు.

రత్తమ్మ—అవన్నీ యింటో యెవరు పెట్టిస్తారూ?

కాంతమ్మ—ప్రకాశం అన్నయ్యగారు వెళ్లారులే. విశాలాక్షి దొడ్డమ్మగారిని తీసుకురాతల్లీ నువ్వూ.

(బంగారమ్మ వెళ్లిపోతుంది.)

రత్తమ్మ—(స్వగతం) పేరుభట్టు దగ్గిరేవున్నా వాడితో చెప్పిందిగాదు ఆసామాను యింటో పెట్టించమనీ. నా ఆశకి ఆధారం లేకపోలేదు. (వెళ్లి పోతుంది.)

(తెర దించాలి.)

అయిదో రంగం

[ప్రకాశంయిల్లు. దక్షిణపువసారాలో సూరన్నా, పేరుభట్టూ, జోగమ్మా కూచునివుంటారు.]

జోగమ్మ—నువ్వింతలక్ష్యం లేకుండా తిరుగుతున్నావేం?

పేరుభట్టు—యేం చేశానూ లక్ష్యం లేకుండానూ?

జోగమ్మ—దాని తమ్ముళ్లుండగా చిన్నమామకి నువ్వెందుకు కర్మచెయ్యాలీ?

పేరుభట్టు—వాళ్లూరుకుంటే నేనూ వూరుకోవాలా?

సూరన్న—వాళ్లూరుకుంటే చిన్నత్త కూలి మనిషిచేత చేయించుకుంటుంది. నీకెందుకూ?

పేరుభట్టు—నేను చేస్తే యేంతప్పూ?

జోగమ్మ—వూళ్లోవాళ్లెవళ్లేనా పోతూవుంటే వాళ్లకందరికీ నువ్వుచేస్తావా?

పేరుభట్టు—చిన్నమామ వూళ్లోవాడేనా?

సూరన్న—అతని భావమరుదులికి లేని బాధ నీకేం?

పేరుభట్టు—ఇవి బ్రాహ్మడనవలసిన మాటలే?

సూరన్న—నువ్వే మహా బ్రాహ్మడవు పాపం. చూశావా అమ్మా? (నిరాసకంగా చెయ్యి వూపి పెదవివిరుస్తాడు.)

పేరుభట్టు—(ముంగోపంతో) యేమిటూ వికారం? తెలివితేటలన్నీ వెళ్లగక్కుస్తున్నావే?

సూరన్న—వూరుకోరా అట్టే మాట్లాడకా.

పేరుభట్టు—నీతో మాట్లాడ్డం నాదితప్పే. నీకు హృదయంలేదు. మెదడులేదు. కేవలమూ యినే పదుంగవు. కుట్ర, ద్రోహం, అసహనం—ఇవన్నీ నీదగ్గిర పేరుకొనివున్నాయి. నిన్ను నమ్మినవాడవు ములిగిపోవడమే. మరిలేలకు.

సూరన్న—నోరుమూసుకోరా.

పేరుభట్టు—ఛీ!

సూరన్న—నీతో మాట్లాడగూడదు. (వెళ్లి పోతాడు.)

పేరుభట్టు—(సూరన్న పోయినవేపు చూస్తూ) పాకీది నయం నీకంటే. అప్రాచ్యుడవు.

జోగమ్మ—వాణ్ణి తిడతావా?

పేరుభట్టు—విన్నావా?

జోగమ్మ—వాడేమి అవాచ్యాలు పలికాడూ?

పేరుభట్టు—ఏం అట్టేపెట్టాడూ?

జోగమ్మ—నువ్వు నాకడుపున చెడబుట్టావు ఛండాలుడా!

పేరుభట్టు—నీకలా తోచిందా?

జోగమ్మ—నామాడ కడ్డుచెబుతావా?

పేరుభట్టు—నన్నాజ్ఞాపించడానికి నీకు అధికారంలేదు. నువ్వు తాసికమాటలు వింటున్నావు.

జోగమ్మ—నువ్వు పురుగులోడిచస్తావు.

పేరుభట్టు—నీనోటికడ్డురాను. (వెళ్లి పోతాడు.)

జోగమ్మ—చచ్చుపెద్దమ్మా! యెంతపనీ చేశావూ? నాపగవాళ్లలో కలుస్తావా? నీకు దమ్మిడీ ఆస్తి మిగలనివ్వను. చూస్తూవుండు.

(అప్పుడు రత్తమ్మవస్తుంది.)

రత్తమ్మ—ఏంచేస్తున్నావే చిన్నక్కా?

జోగమ్మ—యేడుస్తున్నాను.

రత్తమ్మ—అదేమిటే అలాఅంటావూ?

జోగమ్మ—పేరిగాడు చెప్పినమాట వినడంలేదు. వాడు మానట్ట.

రత్తమ్మ—యిక నువ్వాళ్లే పట్టుపట్టకు. పైకి తెలిస్తే బాగుండదు.

జోగమ్మ—వూరుకోమంటావా?

రత్తమ్మ—వాడు విననప్పుడేమిటే చెయ్యడం?

జోగమ్మ—చూడు వీణ్ణేంచేస్తానో?

రత్తమ్మ—యింటికి వెళ్లాక నీయిష్టం వచ్చినట్లు చెయ్యి. యిక్కడ గట్టిగా మాట్లాడకు......కాని కన్నకొడుకు చెప్పినమాట వినకపోతే తల్లిముండకి అంతకంటే యిక కష్టంలేదు.

జోగమ్మ—నీకొడుకు చూడూ. వాణ్ణి చూస్తే ముచ్చటవుతుంది.

రత్తమ్మ—నాతండ్రి నామాట కెదురు చెప్పడమ్మా, నేనదృష్టవంతురాలినే.

జోగమ్మ—యిలాంటి నిర్భాగ్గుడు పుట్టాక 'నేనూ అదృష్టవంతురాలినే' అని చెప్పుకునీయోగం నాకెలా వుంటుందీ? ఛీ! వీడిబతుక్కాలా?

(అప్పుడు రాయడువస్తాడు)

రత్తమ్మ—ఏంనాయనా యిలావచ్చావూ?

రాయడు—వూరికేనమ్మా!

జోగమ్మ—సాటివాళ్లని చూసేనా బుద్ధితెచ్చుకోకపోతే చావనా?......వొరే రాయడూ! పేరిగాడేం చేస్తున్నాడురా?

రాయడు—పెద్దన్నయ్యా, పెద్దవొదినా వచ్చారు, వాళ్లతో లోపలికి వెళ్లాడు.

జోగమ్మ—దిగారూ? పైవంటలోకి వస్తారుకామోసు. ఏమిటిగతి?

రత్తమ్మ— కళ్లుమూసుకుని నాలుగురోజులూ గడిపెయ్యి.

జోగమ్మ—నావల్లగాదు. వుపాయంచూడాలి. సూరన్న యెక్కడున్నాడో తీసుకురా రాయడూ వోమాటూ.

రత్తమ్మ—వెళ్లిరా నాయనా!

రాయడు—అలాగే. (వెళ్లిపోతాడు.)

జోగమ్మ—నాకొడుక్కూడా యిలాంటివాడు కాగూడదూ?

రత్తమ్మ—నిజానికి నీకొడుకుదగ్గిర దురుసుతనం వుందే.

జోగమ్మ—నాకర్మంకాకపోతే నువ్వీమాట అనగలవా నామొహమ్మీదా?

రత్తమ్మ—నేనేమన్నానే మాతల్లీ?

జోగమ్మ—నాప్రారబ్ధానికి నేనేడుస్తూవుంటే నీమీద పెట్టుకుంటావేమిటే?

రత్తమ్మ—అంతేగదా? నేనేమీ తప్పుమాట అనలేదమ్మా నన్ననడానికి నువ్వూ.

జోగమ్మ—నిన్నేమంటానూ? నిన్ననడానికీ, నీచేత పడ్డానికీ నాకేం? నాకొడుకు నేను చెప్పినమాట వినడంలేదు; కనక నేనేదో గుంజుకోకుండా వుండలేను. వొకళ్లనెందుకంటానూ నేనూ?

రత్తమ్మ—మడికట్టుకునీ వేళ అవుతోంది వెడతానుమరి.

జోగమ్మ—చూడూ పెద్దపీనుగు రానే వచ్చింది కనక అక్కడివంటకి దాన్నప్పగించి నువ్విక్కడికిరా. నువ్వుంటే నాకు కసింత మనశ్శాంతేనా కలుగుతుంది.

రత్తమ్మ—కాంతమ్మ నన్నువిడిచిపెట్టదే.

జోగమ్మ—పట్టుకుంటుందా యేమిటి? దాంతో వియ్యమందాలని చూస్తున్నావుకామోసు నువ్వు. దాని మొఖం మండేది.

రత్తమ్మ—అదేమిటే అలాఅంటావూ?

జోగమ్మ—దానికర్మం దాందీ. అది మనకెందుక్కానీ, నువ్విక్కడికివస్తూ.

రత్తమ్మ—కాంతమ్మ వొప్పుకుంటే చూస్తానులే. (వెళ్లిపోతూ స్వగతం) అక్కడ వంటమానేస్తే అస్తమానూ అక్కడ వుండడానికి కారణం వుండదు. వాళ్లకి—బంగారమ్మకీ, కాంతమ్మకీగూడా పేరు భట్టు మీద కలిగిన అభిమానాన్ని ముదరనివ్వగూడదు. నేనివతలికివస్తే రాయడొక్కడైపోతాడు. విషమసంధి వచ్చి పడింది. ఉహ్! ఇక్కడేంవుంది నాకు? వీళ్లకర్మం! నాకేం? (వెళ్లిపోతుంది.)



చార్ మినార్, హైదరాబాదు

—కె. కృష్ణమూర్తి.